www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

గురువారం

15 మే 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



- రామప్ప ఆలయ సందర్శన
- బతుకమ్మ ఆడి సందడి చేసిన అందగత్తెలు

5లో

# చారిత్రక నగరంలో.. అందాల భామలు

కలంజ్యోతి, వరంగల్ : ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనే సుందరీమణులు బుధవారం చారిత్రక ఓరుగల్లు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా అతిథులకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బతుకమ్మ, మేళతాళాలతో స్థానిక మహిళలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రామప్ప ఆలయం వద్ద చీరకట్టులో మెరిసిన అందాల భామలు గ్రూప్ ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. రామప్ప ఆలయ విశిష్టతను టూరిజం గైడ్లు వారికి వివరించారు. అంతకుముందు హరిత కాకతీయ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు రెండు బృందాలుగా ఏర్పడి వరంగల్ నగరంలో పర్యటిస్తున్నారు.



## నిర్మాణ అనుమతులు సులభతరం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి తెర
- లైడార్ సర్వేతో వనరుల మ్యాపింగ్
- అన్ని విభాగాల విభజనలో ఏకరూపత
- త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాలు

2లో

## ఉగ్రవాదాన్ని అణిచివేయాల్సిందే

### సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

- భారత్–పాక్‌ల మధ్య మూడో దేశం మధ్యవర్తిత్వం అవసరం లేదు
- భారత్‌పాక్ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన బాధేస్తోంది

4లో



# పేదల జీవితాలపై బుల్డోజర్ల తో దాడి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలో ప్రతిరోజు పేదల ఇళ్లతో పాటు వారి జీవితాలపై బుల్డోజర్ల తో దాడి చేయడం ఏంటని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఏమైనా ఉందా అని నిలదీశారు. తాజాగా వరంగల్ లో కూల్చివేతలపై కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. బుధవారం మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్ లోని వెయ్యి స్తంభాల గుడి, రామప్ప ఆలయాన్ని సందర్శిస్తున్న నేపథ్యంలో వరంగల్ లో అధికారులు పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. అందాల పోటీల కోసం పేదల ఇళ్లను ధ్వంసం చేయడమేనా ప్రజాపాలన అంటే అని నిలదీశారు. రాజభవనాలలో విలాసవంతమైన విందులు చేసి రూ. 200 కోట్లతో పాటు రూ. కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన తర్వాత మీ కృరమైన బుల్డోజర్లతో పేదల జీవితాలను నలిపివేయాల్సి వచ్చిందా అని నిలదీసారు. ఇంత చేశాక మీది ప్రజాపాలన అని పిలుచుకోవడం హాస్యాస్పదంగా ఉందని.. రాహుల్ గాంధీ తెలంగాణ ప్రభుత్వ అమానవీయ చర్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కమిటీ ఆన్ సబార్డినేట్‌లో

# రఘునందన్‌కు చోటు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ కమిటీల్లో మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు మరో కీలక బాధ్యత దక్కింది. కమిటీ ఆన్ సబార్డినేట్ లెజిస్టేషన్‌లో ఆయనను సభ్యుడిగా నియమిస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో చైర్మన్ గా బాలశౌరి వల్లభనేని ఉన్నారు. అంతే కాకుండా రఘునందన్ రావుతో పాటూ సభ్యులుగా పి. చిదంబరం, సతీష్ కుమార్ గౌతమ్, మొహమ్మద్ జావిద్, సంబాజీ రావు మానె, మహువా మొయిత్రా, ప్రేమ చంద్రన్, శ్రీరాజీవ్ రాయ్, ఏ. రాజా, అలోక్ కుమార్ సుమన్, వివేక్ థాకూర్, రాజేశ్ వర్మలను సభ్యులుగా నియమించారు. రఘునందన్ రావు ఇప్పటికే పర్సనల్ పబ్లిక్ గ్రీవెన్సెస్, లా అండ్ జస్టిస్ స్టాండింగ్ కమిటీ మిరియు కన్సల్టేటివ్ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు మరో కీలక బాధ్యత దక్కడంతో అభిమానులు, పార్టీ శ్రేణులు ఖుషీ అవుతున్నారు.

# నిర్మాణ అనుమతులు సులభతరం



**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభత రంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌర సేవలు, అనుమతులపై రాష్ట్ర సచివాల యంలో రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధి లోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖా స్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఏదైనా నిర్మాణం లేదా గృహాలు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన సేవలకు ఒకే ప్లాట్‌ఫాంపై దరఖాస్తు అందజేస్తే వారికి అవసరమైన సేవలన్నింటికి సింగిల్ విండోలో అనుమతి లభించేలా ఉండాలన్నారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆయా శాఖల వసూలు చేసే బిల్లుల సైతం ఒకే సారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానం ఉండాలన్నారు. వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని ఆయా విభాగాల ఖాతాల్లో జమ అయ్యే విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని... మరింత సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సీఎం సూచించారు. పౌర సేవలు మెరుగ్గా అందేందుకు గానూ వివిధ శాఖల విభజనలో ఏకరూపత ఉండాలని సీఎం సూచించారు. అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం చేయకూడదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీల్లేదన్నారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే అందుకు కారణాలు ఏమిటో దరఖాస్తుదారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి ఏం చర్యలు తీసుకోవాలో కూడా అధికారులే సూచించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈ.వీ.నరసింహారెడ్డి పాల్గొన్నారు.



# త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాలు ..

ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే ఏపీలో భారీ ప్రాజెక్టులకు నెహ్రూ శంకుస్థాపన చేశారు. నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జునసాగర్, శ్రీశైలంతోనే మనకు నీళ్లు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 50, 60 ఏళ్ల కిందట నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి మనకు నీళ్లు ఇస్తున్నాయి. నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ ఎన్నో వరదలు, ఉపద్రవాలను తట్టుకుని నిలబడ్డాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లలోనే కూలింది. కట్టిన మూడేళ్లలోనే కూలిన ప్రాజెక్టు ప్రపంచంలో మరెక్కడా లేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో అదనంగా వెయ్యి ఎకరాలకు కూడా నీరు అందలేదు. కనీసం మట్టి పరీక్షలు కూడా చేయకుండా ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది'' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

కలంజ్యోతి
3
గురువారం 15.05.2025 General News

# హనుమాన్ జయంతి ఉత్సవాలపై సమీక్ష

## అధికారులకు సూచనలు చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ



**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో 20వ తేదీ నుంచి 22 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో తెలిపారు. శ్రీహనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులకు జయంతి ఉత్సవాల పనులపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పి అశోక్ కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు శ్రీ స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కపిందర్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, అధికారులు చంద్రశేఖర్, హరిహరనాథ్ , తహసీల్దార్ మునిందర్, మండల అధికారులు, ఆయా శాఖల ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మన చేతిలోనే పిల్లల భవిష్యత్


**కలంజ్యోతి, నాగారం :** పిల్లల బంగారు భవిష్యత్ వారి తల్లిదండ్రుల చేతిలో ఉంటుందని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో జిల్లా ఎస్పీ పెద్దపల్లి నరసింహ ఆదేశాల మేరకు 'ప్రజా భరోసా' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యువత గంజాయి, బెట్టింగ్స్ భారిన పడకుండా ఉండేందుకు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువులో పుస్తకాలపై ఆశక్తి పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఐలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# భూములను కాపాడడానికే భూ భారతి

## సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్



**కలంజ్యోతి, నాగారం :** నాగారం మండలం మామిడిపల్లి గ్రామంలో భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవడానికి గతంలో పోర్టల్ లో 33 మాడ్యూళ్లు ఉండేవి. అయితే భూ భారతిలో ఈ విధానాన్ని సులభతరం చేశారు. మాడ్యూళ్ల సంఖ్యను 33 నుంచి ఆరుకు కుదించారు. ఈ నూతన చట్టం ప్రకారం మ్యూటేషన్ కు మ్యాపు తప్పనిసరిగా ఉంటుంది. వారసత్వ భూముల వి షయంలో తప్పులు జరగకుండా చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయి విచారణ తర్వాతే ప్రక్రియ ముందుకు సాగుతుంది. నిర్ణీత కాలంలో విచారణ చేసి తరువాతనే పాస్ పుస్తకాలు జారి అవుతాయి. ఈ ఏడాది జనవరి 9న రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్ యాక్ట్ (ఆర్ఓఆర్) 2025 భూభారత చట్ట రూపు దాల్చింది. భూ భారతిలో ఎక్కడి నుంచైనా భూముల వివరాలను చూసుకునేలా డిస్ ప్లే చేస్తారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థా యిలో రెండంచెల అప్పిల్ వ్యవస్థ ఏర్పాటు కానుంది. 11 కాలాలతో కొత్త పహానిని ఏర్పాటు చేయనున్నారని సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ వివరించారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలపై గంజాయి డ్రగ్స్ నిర్మూలనపై కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళా బృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, ఎం వేణు, ఎం మంజుల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, పీ శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వధూవరులకు దొంతి ఆశీర్వదం

**కలంజ్యోతి, నర్సంపేట :** నర్సంపేట మండలం సీతారాం తండాకు చెందిన వాంకుడోత్ రజితఉక్కస్వామి దంపతుల కుమార్తె కృష్ణవేణి శ్రీనివాస్ వివాహ వేడుకల్లో ముఖ్య అతిథిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## కూలీల మధ్య జన్మదిన వేడుకలు

**కలంజ్యోతి, గీసుకొండ :** ఏలకుర్తి హవేలి గ్రామంలో ఉపాధి హామీ శ్రామికుల మధ్య, గ్రామపంచాయతీ సిబ్బంది సమక్షంలో పంచాయతీ కార్యదర్శి కోడెపాక రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో కారోబార్ శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలోని ఇటీవల మృతిచెందిన బొమ్మరబోయిన నర్సయ్య కుటుంబానికి ఎల్లయ్యగూడెం గ్రామ అధ్యక్షుడు ఎదురబోయిన సాంబయ్య 50కిలోల బియ్యం, రూ.3000 నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కందికొండ విజయ్ కుమార్, భాషబోయిన రామలింగం, ఎదురబోయిన నరసింహస్వామి, మంచోజు మనోజ్ కుమార్, మంద కొమురయ్య, రవికుమార్, మధ్యబోయిన శ్రీధర్, రాయపూరి సమ్మయ్య, కుక్కల రామచంద్రు, కర్రె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఓసీ అందజేత

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని నూకపెల్లికి చెందిన ఆలకుంట నవీన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం నిమ్స్ లో జాయిన్ కాగా, వైద్య ఖర్చులు దాదాపు రూ.3లక్షలు కావడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఎల్ఓసి మంజూరు చేయించగా.. బాధితుడికి పార్టీ నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, శ్రీను అందజేశారు.




# ఉగ్రవాదాన్ని అణిచివేయాల్సిందే

## సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ప్రపంచ సమస్యగా మారిన ఉగ్రవాదాన్ని కూకుటి వేళ్లతో అణిచివేయాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత్ పాక్‌ల మధ్య మూడో దేశం మధ్యవర్తిత్వం అనవసరమన్నారు. ఇతర దేశాల మధ్యవర్తిత్వంతో భారత్ స్థాయి తగ్గుతుందని చెప్పారు. భారత్‌పాక్ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ఆయన చొరవతోనే యుద్ధానికి బ్రేక్ పడిందని చెప్పడం బాధేస్తోందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. ఆపరేషన్ సిందూర్ వివరాలు వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ మోసపూరిత వాగ్దానాలతో తెలంగాణలో అధికారంలో వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మాట మారుస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. ఎన్నికల ముందు ఇష్టమొచ్చినట్లు రేవంత్‌రెడ్డి వాగ్ధానాలు ఇచ్చారని అప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రేవంత్‌రెడ్డికి తెలీదా? అని నిలదీశారు. హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఆపరేషన్ కగార్ ను ఆపడం శుభపరిణామం అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు అన్నారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# క్యాన్సర్ బాధిత కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి అండ



**కలంజ్యోతి, హైదరాబాద్ :** క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. సిద్ధిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మిప్రసన్న, కుమార్తెలు లక్ష్మి సుసజ్ఞ (6), స్మయ (2 నెలలు), తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. ఇంటికి ఆధారమైన సాయిచరణ్ క్యాన్సర్ బారినపడడంతో అతడి చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్ధిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో వారు ముఖ్యమంత్రిని గతంలో కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చలించిన రేవంత్ రెడ్డి సాయిచరణ్ చికిత్సకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. దాంతో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సీఎం సాయిచరణ్‌కు సూచించారు.



# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కల తో సహా త్వరలో వెల్లడిస్తాం
- ఇండ్లు ఇస్తామని బీఆర్ఎస్ నాయకులు పదేండ్లు మోసం చేశారు
- రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం



**కలంజ్యోతి, ఖమ్మం :** రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం ఇలా ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ. వేలల్లో ఖర్చు చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా మధిర నియోజక వర్గం ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కల తో సహా త్వరలో వెల్లడిస్తాం అన్నారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ తెలంగాణ ను గాలికి వది లేసిందని ఆరోపించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారు. ఆదాయం లేకపోయి నా, అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద సంఖ్యలో ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖకు రూ. 11,600 కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. రాబోయే రో జుల్లో వైద్య రంగానికి మరింత నిధులు కేటాయి స్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ఐదేండ్ల పాలనలో రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మొదటి ఏడాది ప్రతి నియోజకవర్గంలో 3500 ఇల్లు నిర్మిస్తున్నామని, ఇందుకు రూ. 22,500 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అడవి హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరా గిరి జలవికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంప్ సెట్లు, సోలార్ వి ద్యుత్తు, పామ్ ఆయిల్, అవకాడో మొక్కలు ఉచి తంగా అందజేస్తామన్నారు. వచ్చే ఐదేండ్లలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరు లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నా మన్నారు. అందులో భాగంగా మొదటి సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు రూ. 21 వేల కోట్లు అందజేశాం అన్నారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయనీ వారం దరికీ 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నామని తెలిపా రు. గతంలో పెద్ద రోగం వస్తే ఇల్లు వాకిలి అమ్ము కోవాల్సిన పరిస్థితి ఉండేది అన్నారు. రాజీవ్‌ఆ రోగ్యశ్రీ వైద్య పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచాం, ఆధారంగా కొత్త చికిత్సలను చేర్చాం రాష్ట్ర ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న పెద్ద భరోసా ఇది అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి వందరోజుల పని కల్పిస్తున్నాం, అదే కుటుంబంలో పిల్లలు చదువుకునేందుకు ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన యంగ్ ఇండి యా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించారు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తాం అన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి రూ. 11,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పిల్లలు చదువుకుంటే వారి ఫీజు రియంబర్స్మెంట్ చేస్తున్నాం అన్నారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నాం అన్నారు. రూ. 500 కే గ్యాస్ సిలిండర్, 2 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కలిగిస్తున్నాం అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి ఇప్పటికే 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం, మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నాం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు రూ. 9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రారంభించామని, జూన్ 2న మంజూ రు పత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా ఐదు లక్షల మంది నిరుద్యోగ యు వతీ యువకులకు ప్రయోజనం చేకూరుతుందనీ డిప్యూటీ సీఎం అన్నారు.

# త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం

## బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

- కాంగ్రెస్ , బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరింది
- రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ సీఎం అవబోతున్నారు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం కాబోతున్నదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జూన్ 2 లేదా డిసెంబర్ 9 తర్వాత కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం తథ్యం అని ఇది తప్పక జరగబోతున్నదన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తానన్న హరీశ్ రావు ఇప్పుడు కేటీఆర్ నాయకత్వంలోనూ పని చేస్తానని చెబుతున్నారని ఎందుకు ఆ రకంగా చెప్పాల్సి వచ్చిందని ప్రశ్నిం చారు. బుధవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందని కీలక వ్యాఖ్యలుచేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు మధ్య రాజీ కుదిరిందని ఆరోపించారు. ఇరు పార్టీల మధ్య విలీనం, అధి కార మార్పిడే మిగిలి ఉందన్నారు. తెలంగాణలో సీఎం మార్పు ఖాయం అన్నారు. రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ సీఎం అవబోతున్నారని చెప్పా రు. ఇందులో భాగంగానే ఇప్పటికే కవితకు న్యాయసలహా అందిస్తున్న ప్రముఖ న్యాయవాదిని కాంగ్రెస్ ఇప్పటికే చట్టసభల్లో కూర్చో బెట్టింద న్నారు. సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, తాను మాట నిలబెట్టుకోవాల్సి ఉందని కేసీఆర్ గతంలో అనేక సందర్భాల్లో అన్నారన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోని నిర్ణయాలపై విచారణ మందకొడిగా సాగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రస్తుత కాంగ్రెస్ 15 నెలల పాలనలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల్లో జరగకపోవడంతో నిజమైన అర్హులకు ప్రభుత్వ ఫలాలు చేరడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిందని అతితక్కువ సమయంలో అనుకున్న లక్ష్యం నెరవేర్చడంలో, ప్రపంచంలో పాక్ ను ఏకాకిని చేయడంలో ప్రధాని మోడీ సక్సెస్ అయ్యారన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఓ వైపు ప్రపంచ దేశాలు భారత్ కు బాసటగా నిలుస్తుంటే మరో వైపు భారత్ దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మాట్లాడలేక పోతున్నాయని మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలని, టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న దేశాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఇప్పటి వరకు ఒక్కసారి కూడా కమ్యూనిస్టు పార్టీలు తీర్మానం చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు.



# కాంగ్రెస్ నాగారం ముఖ్య కార్యకర్తల సమావేశం

**కలంజ్యోతి, నాగారం :** కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, తుంగతుర్తి నియోజకవర్గ పరిశీలకులు శత్రురావు అని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఏఐసీసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు తుంగతుర్తి నియోజకవర్గంలోని నాగారం మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. తుంగతుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మందుల సామేలును తుంగతుర్తి నియోజక వర్గ చరిత్రలోనే 52 వేల ఓట్ల మెజారిటీ తో గెలిపించారని, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని 70 వేల పై ఓట్లతో మెజార్టీ ఇచ్చారని గుర్తుచేశారు. 2017 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారికి పార్టీ అన్ని సమయాలలో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. అనంతరం మండల బ్లాక్, మండల పార్టీ, గ్రామ శాఖ అధ్యక్షుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, మహిళా అధ్యక్షురాలు అనురాధ కిషన్, ఆకుల బుచ్చిబాబు, నాగారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగయ్య, తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, జనతారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, పానుగంటి నరసింహారెడ్డి, మోహన్ రెడ్డి, కొండ మల్లేష్, సోమయ్య, జయమ్మ, విజయ, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.



# గిరిజన అసెంబ్లీ సెగ్మెంట్లలో 5.07లక్షల ఇండ్లు

## గవర్నర్ జిష్ణుదేశ్ వర్మతో మంత్రి పొంగులేటి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించారు. గవర్నర్ ఆలోచన, సీఎం సూచనల మేరకు గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా 5.07లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. ఐటీడీఏ పరిధిలో చెంచు కుటుంబాలకు పదివేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. మంత్రి పొంగులేటి బుధవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాజ్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూభారతి చట్టం అమలును గవర్నర్ కు వివరించారు. మొదటి దశలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపట్టామని చెప్పారు. గవర్నర్ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుకుంట, గొగులపూడి, ఆదిలాబాద్ జిల్లా భుర్కి, మంగ్లీ, నాగర్ కర్నూల్ జిల్లా అప్పాపూర్, బౌరాపూర్ గ్రామాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గవర్నర్ కు వివరించారు. భూ భారతి చట్టాన్ని గత 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని ఈ నెల 5వ తేదీ నుంచి 28 మండలాల్లో అమలు చేస్తున్నామని గవర్నర్ కు తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండానే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు.

# చిన్నడ్రోన్లే లక్ష్యంగా 'భార్గవస్త్ర'

**భువనేశ్వర్ :** చిన్నపాటి డ్రోన్లను లక్ష్యంగా చేసుకునే 'భార్గవస్త్ర' కౌంటర్ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఇందుకు సంబంధించిన వివరాలను గోపాల్ పూర్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ చిన్నపాటి 'భార్గవస్త్ర' 2.5 కిలో మీటర్ల స్వల్పకాలిక శ్రేణి లక్ష్యాలను ఖచ్చితత్వంతో మట్టుపెట్టగలదు. చిన్నపాటి డ్రోన్ లను నేలకూల్చేందుకు ప్రత్యేకంగా రూపొందించారు. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్డీఏఎల్) రూపొందించింది. ఇందులో మైక్రో రాకెట్లను సముద్ర తీర ఫైరింగ్ రేంజ్ లో విజయవంతంగా పరీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలను వందకు వందశాతం ఖచ్చితత్వంతో నేలకూల్చింది. ఈ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థను మూడు సార్లు విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. నాలుగు 'భార్గవస్త్ర'ను ఊహించిన విధంగానే పని చేసినట్లు అధికారులు వివరించారు. 20 మీటర్ల ప్రాంతంలో ఒక్క భార్గవస్త్ర రక్షణ కవచంగా నిలుస్తుంది. 2.5 కి.మీ. దూరంలో ఉన్న అన్ని లక్ష్యాలను ఛేదిస్తుంది. భారత రక్షణ శాఖ, వైమానిక స్థావరాలు, సరిహద్దు ప్రాంతాల్లో ఇది అదనపు రక్షణ కవచంగా ఉపయోగపడుతుంది. ఈ డ్రోన్ ప్రయోగించాక లక్ష్యాన్ని కూడా మార్చుకునే వెసులుబాటు ఉంది. అదే సమయంలో 6 నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న ముప్పును 'భార్గవస్త్ర' పసిగట్టగలదు.

# చారిత్రక నగరంలో.. అందాల భామలు

**కలంజ్యోతి, వరంగల్ :** ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనే సుందరీమణులు బుధవారం చారిత్రక ఓరుగల్లు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా అతిథులకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బతుకమ్మ, మేళతాళాలతో స్థానిక మహిళలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రామప్ప ఆలయం వద్ద చీరకట్టులో మెరిసిన అందాల భామలు గ్రూప్ ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. రామప్ప ఆలయ విశిష్టతను టూరిజం గైడ్లు వారికి వివరించారు. అంతకుముందు హరిత కాకతీయ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు రెండు బృందాలుగా ఏర్పడి వరంగల్ నగరంలో పర్యటిస్తున్నారు.










Cinema
కలంజ్యోతి
గురువారం 15.05.2025

# నా కల నెరవేరింది

హీరోయిన్ షాలిని పాండే 'అర్జున్ రెడ్డి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'మహానటి, ఇద్దరి లోకం ఒక్కటే, 118 నిశ్శబ్దం వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. గత ఏడాది 'మహారాజ్' సినిమాతో ప్రేక్షకులను అలరించింది. ఇక అప్పటి షాలిని అవకాశాలు రాకపోవడంతో ఖాళీగా ఉంటుంది. సమయం దొరికినప్పడల్లా సోషల్ మీడియాలో తన ఫొటోలు షేర్ చేస్తోంది. తాజాగా, షాలిని పాండే తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. "మూడు సంవత్సరాల క్రితం, జయేష్ భాయ్ జోర్దార్ హిందీ చిత్ర పరిశ్రమలోకి నా మొదటి అడుగు. చాలా సంవత్సరాలుగా నేను మోస్తున్న కల నెరవేరింది. యష్ రాజ్ మాయాజాలం, రణ్‌వీర్ సింగ్ అద్భుతమైన ప్రతిభ, ఆది సర్ పూర్తి విశ్వాసం, నా అంతర్ దృష్టిని ఎల్లప్పుడూ నమ్మే నా అద్భుతమైన దర్శకుడు దివ్యతో ఇది నిజమైంది. నేను భయపడ్డాను, కళ్లు విశాలంగా ఉన్నాయి. వారు నన్ను ఎదగడానికి, ఎగరడానికి అనుమతించారు. నన్ను ఒక కేఫ్ లో చూసి ప్రతిదీ మార్చినందుకు షనూస్ శర్మకి ధన్యవాదాలు. నా చేయి పట్టుకున్న బృందానికి, నా హృదయాన్ని పట్టుకున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు! జయేష్‌భాయ్ మొత్తం బృందానికి ధన్యవాదాలు" అని రాసుకొచ్చింది. అలాగే 'జయేషాబాయ్ జోర్దార్' సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఫొటోలను షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు లవ్ ఎమోజీలు షేర్ చేస్తున్నారు.

